ముసుగు

పాలకూర సీతాలత

సమయం ఉదయం పదిగంటలు కావస్తోంది ఆఫీసుకి వెళ్లడానికి సిద్ధం అయిన పావనరావు చెప్పులు తొడుక్కుని వీది గుమ్మం దగ్గరకి వచ్చాడు తమ ఇంటి ముందే ఆగిపోయి, రోడ్డు పక్కన నిలబడ్డ చంద్రమౌళి కనిపించగానే ఏదో సందేహం వచ్చి మెట్లు దిగాడు వీది వైపు వున్న తమ బెడ్‌రూం కిటికీ వైపు చూశాడు అతని ఊహ అబద్ధం కాలేదు కిటికీ తెర తొలగించి అక్కడే నిలబడి వుంది అతని కూతురు సుహాసిని పావనరావు కళ్లల్లో నిప్పులు కురిశాయి

సుహా ' అంటూ అరిచాడు కోపంగా

సుహాసిని అక్కడ నుంచి తప్పుకుంది కిటికీ తెర పడింది

రోడ్డు మీద చంద్రమౌళి గబగబా అడుగులు వెయ్యసాగాడు

వెంటనే రోడ్డు మీదకు పచ్చిన పావనరావు

చంద్రమౌళీ అంటూ పిలిచాడు బెరుగ్గా చంద్రమౌళి ఆగేడు

నీకు ఇదేమన్నా బాగుందిటోయ్? కొంచెం కోపంగా అన్నాడు పావనరావు

క్షమించండి సార్ నేను పాడుబుద్ధితో అక్కడ ఆగలేదు ఆమెను పెళ్లి చేసుకుందుకు నేను ఆరాట పడుతున్నానన్న విషయం మీకు తెలియనిది కాదు ఆమెను చూడకుండా వుండలేను కానీ మీరు అంగీకరించక

చంద్రమౌళి మాటలు పూర్తి కాకుండానే పావనరావు అందుకున్నాడు

అవునయ్యా' అంగీకరించను సాంప్రదాయాలు, కట్టుబాట్లు అనేవి పాటించాలి

కానీ ఆ సాంప్రదాయాలు, కట్టుబాట్లు కన్నీరుకి కారణం అవుతున్నప్పుడు వాటిని -పట్టించుకోకూడదని నా ఉద్దేశ్యం అన్నాడు పావనరావుతో చంద్రమౌళి

మన ఉద్దేశాలు ఉత్తర, దక్షిణ దృవాలు, అటువంటప్పుడు ఇక మాట్లాడటం అనవసరం అది కూడా ఇలా రోడ్డు మీద నడుస్తూ దయచేసి ఇకముందు మా ఇంటి దగ్గర ఆగకు నాకు కోపం తెప్పించకు తర్వాత వచ్చే అనర్థాలకు నేను బాధ్యుడిని కాను అంటూ బెదిరించాడు పావనరావు

చంద్రమౌళి మాట్లాడలేదు వడివడిగా అడుగులు వేసుకుంటూ వెళ్లిపోయేడు

చంద్రమౌళి వంక కోపంగా చూసి పళ్లు నూరుకున్నాడు

'ఇందులో తప్పు సుహాసినిది కూడా ఉంది ముందు ఆమెను అదుపులో పెట్టాలి భర్తపోయిన ఆడది ఇలా ప్రవర్తించడం ఎంత తప్పు!అనుకున్నాడు

సాయంత్రం ఇంటికి వెళ్లాక సుహాసిని బాధపడ్డా

సరే ఆమెను గట్టిగా మందలించాలి

ఆ రోజు ఆఫీసులో అన్యమనస్కంగానే గడిపాడు

ఆ సాయంత్రం ఇంటికి వెళ్ళగానే అతన్ని చూసి సుహాసిని లోపలకు వెళ్ళి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది అది ఆమెకు అలవాటు ఆ పని అడక్కుండానే చేస్తుంది

ఆమె ఇచ్చిన గ్లాసు అందుకుని దాన్ని ఖాళీ చేశాడు. అంతగా దాహం వెయ్యకపోయినా.

ఆమె ముఖంలోకి చూసేకా అతని కోపం అంతా నీరు కారిపోయింది.

బాధగా కుర్చీలో కళ్ళు మూసుకుని కూర్చున్నాడు.

సుహాసిని ఆమె వయసు ఎంత? ఇరవై రెండు! ఉన్నంతలో లోటు లేకుండా పెళ్ళి చేశాడు కానీ ఆమె భర్తతో కాపురం చెయ్యకుండానే ఆమె పసుపు, కుంకుమలకు దూరం అయ్యింది ... భగవంతుడు ఎంత నిర్దయుడు!

పెళ్ళి జరిగిన వెంటనే ఆ అబ్బాయికి ఎక్కడో నెల రోజుల ట్రైనింగ్ వుందట అది అయ్యాకా కాపురం పెడతానన్నాడు కానీ ఆ నెల రోజులూ పూర్తి కాకుండానే ఒక రోడ్డు ప్రమాదంలో మరణించాడు

కుంకుమ బొట్టుతో తళ తళ లాడుతుండే ఆమె ముఖం బోసి పోయింది పుట్టెడు బాధ, కొండంత నిరాశ ఆమెను చుట్టుముట్టాయి నిర్లిప్తంగా ఆ నాలుగు గోడల మధ్యా రోజులు గడుపుతోంది

ఆమెకు మళ్ళీ పెళ్ళి చెయ్యమని ఒకరిద్దరు మిత్రులు సలహా చెప్పారు కానీ ఆ ఆలోచనను సమర్థించలేకపోయాడు తను .

ఎంత తప్పు అది! ఆమె అదృష్టం అంతే అని తను సరిపెట్టుకుపోవాలి కానీ ఆమెకు పునర్వివాహం చెయ్యడమా? నలుగురూ ఏమంటారు? తనని వెలి వేసినట్టు చూడరూ? ఆమెను చూస్తుంటే బాధ కలుగుతుందన్న మాట నిజమే కానీ ఆమెకు పునర్వివాహం చెయ్యడానికి సమ్మతించలేకపోతున్నాడు ఆమెను చేసుకుందుకు చంద్రమౌళి సిద్ధంగా వున్నా!

అతని భుజం మీద చెయ్యి పడింది కళ్ళు విప్పి చూశాడు అతని భార్య సీత

ఏమండీ అలా వున్నారు? వంట్లో బాగాలేదా? అంది

'అబ్బే బాగానే వుంది అన్నాడు

బట్టలు మార్చుకుందుకు లోపలకు వెళ్ళాడు కర్టెన్ గుడ్డ మీద ఏదో పువ్వుల డిజైను కుడుతోంది సుహాసిని

"అమ్మా సుహాసినీ నీ బాధ నాకు తెలుసమ్మా! కానీ సంఘాన్ని ఎదిరించలేని పిరికితనం నాది నువ్వు ఏ తప్పూ చెయ్యవన్న నమ్మకం నాకు వుంది అయినా ఆ చంద్రమౌళిని మరిచిపో తల్లీ " అన్నాడు పావనరావు.

సుహాసిని కళ్ళు ఎత్తి చూసింది. ఆమె కళ్ళలో నీళ్ళు.

ఇక అక్కడ వుండలేక బయటకు వెళ్ళిపోయాడు పావనరావు

సుహాసిని ఆలోచనలలో చంద్రమౌళి

చంద్రమౌళి సుహాసినికి కాలేజీలో స్నేహితుడు ఆమెను ఎంతగానో ఆరాధించేవాడు ఆమెను పెళ్ళి చేసుకోవాలని అనుకున్నాడు కానీ సుహాసినికి పెళ్ళి నిశ్చయం జరిగినప్పుడు, ఆ పెళ్ళి జరిగిపోతున్నప్పుడు చేతకానివాడిలా చేతులు ముడుచుకుని కూర్చోవలసి వచ్చింది అందుకు కారణం అప్పట్లో అతను నిరుద్యోగపు వాడి కోరల్లో చిక్కుకుపోయినందువల్ల అక్కడికీ ధైర్యం చేసి అతను ఒక రోజు పావనరావు గారిని కలిసేడు నిరుద్యోగికి తన కూతుర్ని ఇయ్యనని ఆయన ఖచ్చితంగా చెప్పేశారు కొన్ని రోజులు వేచి ఉండమనీ, ఈలోగా ఎంత చిన్నదైనా ఒక ఉద్యోగం సంపాదించుకుంటాననీ బేలగా బ్రతిమాలాడు చంద్రమౌళి

వేళాకోళంగా నవ్విన పావనరావు!

"బాగుందోయ్ నీ వ్యవహారం నీ ఉద్యోగం కోసం నా కూతురికి పెళ్ళి చెయ్యకుండా ఆపు చెయ్యనా? మా అమ్మాయిని మరిచిపో ఇదేం జరిగే వ్యవహారం కాదు బంగారంలాంటి సంబంధం దొరికింది దీన్ని వదులుకోవడం మూర్ఖత్వమే అన్నాడు దాంతో ఇక ఏమీ చెయ్యలేనని గ్రహించిన చంద్రమౌళి, మనసు రాయి చేసుకుని, సుహాసినికి నచ్చ చెప్పి ఆమె పెళ్ళి రోజున ఆ ఊర్లో ఉండకుండా వెళ్ళిపోయేడు

సుహాసిని పెళ్ళి జరిగిపోయింది ఆ తర్వాత జరగకూడనిది కూడా జరిగిపోయింది ఇప్పుడు ఉద్యోగస్థుడైన చంద్రమౌళి సుహాసినికి జరిగిన అన్యాయానికి చాలా బాధపడ్డాడు మనసు పొరలలో ఆమె పైన ఇంకా ప్రేమ వుండటంతో ఆమెను పెళ్ళి చేసుకుందుకు సిద్ధపడ్డాడు సుహాసినికి కూడా అతన్ని పెళ్ళి చేసుకోవాలన్న వాంఛ ఉంది

కానీ ఇందుకు అడ్డు పావనరావు

పావనరావు అభ్యంతరానికి కారణాలు సాంప్రదాయాలు

ఎంత ఘోరం!

సుహాసిని మౌనంగా రోదిస్తుంది చంద్రమౌళి ప్రయత్నాలు చేస్తున్నాడు పావనరావు గారికి నచ్చచెప్పడం కోసం

భగవంతుడు ఏం రాశి పెట్టాడో సుహాసిని నుదుట

చిన్నగా నిట్టూర్చింది సుహాసిని

★ ★ ★ ★ ★

రెండు రోజులు గడిచేకా ఒక సాయంత్రం ధైర్యం చేసి చంద్రమౌళి పావనరావు గారి ఇంటికి వచ్చి ఆయన్ని కలిసేడు

నమస్కారం 'అన్నాడు మర్యాదగా

అతన్ని చూడగానే అయిష్టంగా నుదురు చిట్లించాడు పావనరావు

ఎందుకు వచ్చావు?

మీతో కొంచెం మాట్లాడాలని

ఆ విషయమేగా

అవును సార్ ఇంట్లోవాళ్ళ పోరు ఎక్కువైపోయింది, పెళ్ళి చేసుకోమని ఇన్నాళ్ళు ఏదో రకంగా వంక పెట్టి నెట్టుకు వస్తున్నాను ఇకముందు కుదరదని తోస్తోంది అందుకే మిమ్మల్ని మరొకసారి అడగాలని వచ్చాను సుహాసినిని

అంటూ ఆగిపోయేడు చంద్రమౌళి

మాట్లాడలేదు పావనరావు

ఇప్పుడు నేను ఉద్యోగస్థుడిని సార్ పన్నెండు వందల జీతం

అవునయ్యా! నీకేం తక్కువ? అందుకే మరొక అమ్మాయిని హాయిగా పెళ్ళిచేసుకో అన్నాడు

పావనరావు తేలిగ్గా

అమ్మాయి దొరక్క నేను ఇంతగా అవస్థపడటం లేదండీ మీ అమ్మాయిలాంటి అమ్మాయి దొరకదు కనుక ఇంతగా మీ చుట్టూ తిరగవలసి వస్తోంది సుహాసిని అంటే ఈనాటికీ కూడా నాలో అమితమైన ప్రేమానురాగాలు ఉన్నాయి దయచేసి అందుకే

చూడు చంద్రమౌళీ! ఒక విధవను వివాహం చేసుకుందుకు ముందుకు వచ్చిన నీ సంస్కారాన్నీ, మంచి మనసునీ అభినందిస్తున్నాను కానీ నిప్పులాంటి వంశంలో పుట్టి, సాంప్రదాయాలు ఊపిరిగా బ్రతుకుతున్న నేను నా కూతురికి వివాహం చెయ్యలేను మా బామ్మగారి చెల్లెలుకి భర్త పోయినప్పుడు వయసు ఎనిమిది సంవత్సరాలు ఆమె మళ్ళీ పెళ్ళి చేసుకోలేదే! భర్త శవం ఇంటి ముందు వుంటే ఆమె చింత గింజలు ఆడుకుంది పెద్దవాళ్ళు మందలించి ఆమెను ఏడవమని చెప్పారు అన్నాడు పావనరావు

ఆ రోజులు వేరు కదా! చంద్రమౌళి అన్నాడు

అన్ని రోజులూ ఒక్కటే ఆ రోజుల్లోనూ సూర్యుడు తూర్పున ఉదయించేవాడు ఇప్పుడూ అంతే

నిట్టూర్చాడు చంద్రమౌళి

'మీకు నచ్చ చెప్పడం నాకు చేతకాదు నా అదృష్టం ఇంతే అనుకుంటాను వస్తాను అంటూ లేచి వెళ్ళిపోయేడు

లోపల్నుంచి ఈ సంభాషణ అంతా వింటున్న సుహాసినికి బాధ ఆగలేదు గుమ్మం ముందుకు వచ్చిన అదృష్టం తిరిగి వెళ్ళిపోవడం ఆమెకు నచ్చలేదు కానీ ఏంచెయ్యగలదు? ఆ మొండి తండ్రిని ఎలా ఒప్పించగలదు? బేలగా తల్లి వైపు చూసింది కూతురు చూపులు అర్థం చేసుకుని భర్తకు సమీపించింది సీత

'ఇద్దరికీ ఇష్టం అయినప్పుడు మనం కాదనకూడదు మన అమ్మాయిని ఈ స్థితిలో కూడా పెళ్ళి చేసుకోగల అబ్బాయి దొరకడం ఒక రకంగా అదృష్టం ' అంది సీత

'అతను వెళ్ళాకా నువ్వు మొదలుపెట్టావా? కోపంగా అన్నాడు పావనరావు

అది కాదండీ! మీరే ఆలోచించండి వాళ్ళిద్దరూ కూడా మనపై గౌరవం వుంచి ఇలా ప్రాధేయపడుతున్నారు మీరు అంగీకరించలేదని చెప్పి స్వతంత్రించి ఇద్దరూ ఒకటైతే మన మర్యాద ఏముంటుంది?'

పావనరావు కళ్ళల్లో నిప్పులు కురిశాయి

వాళ్ళకు ఆ ఉద్దేశ్యం లేకపోయినా నువ్వు కలగచేస్తున్నావు ఒకవేళ అలాగే జరిగితే కటుంబ గౌరవం మంట కలిపినందుకు దాన్ని కత్తితో పొడిచి చంపి జైలుకు వెళ్తాను అన్నాడు పావనరావు

ఆ మాటలకు బెదిరిపోయింది సీత

లోపల్నుంచి సుహాసిని మౌనంగా రోదించింది

ముసుగు

విసురుగా లేచి, తనకు కోపం వచ్చిన సంగతి తెలియపరచడానికి అన్నట్లు తలుపులు శబ్దం వచ్చేలా మూసి బయటకు వెళ్ళిపోయేడు పావనరావు

నిరాశగా కూలబడిపోయింది సీత

* * * * *

ఆ రోజు ఆదివారం సాయంత్రం పూట వీధి వైపు గార్డెన్‌లో కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు పావనరావు

"పావనరావ్ ఎవరో పిల్చారు

తల ఎత్తి చూశాడు

నన్ను గుర్తుపట్టలేదుట్రా? అంటూ దగ్గరకు వచ్చాడు ఆ వ్యక్తి

అతని ముఖంలోకి పరీక్షగా చూస్తూ ఆలోచించేడు పావనరావు

'మీరు మీరు

"మీరు ఏమిట్రా నీ ముఖం? నేను బాలాజీని ' అన్నాడు అతను

అప్పుడు గుర్తు వచ్చింది పావనరావుకి

అవును బాలాజీ " అన్నాడు తన హైస్కూలు మిత్రుడితో చెయ్యి కలుపుతూ

అమ్మయ్య! మొత్తానికి గుర్తుపట్టావు అన్నాడు బాలాజీ ఆనందంగా

ఎక్కడనుంచి ఊడిపడ్డావు? ఎక్కడ వుంటున్నావు? నేను ఇక్కడ వున్నట్లు ఎలా తెలిసిందీ? అన్నాడు పావనరావు

"ఆగు మరి అలా ప్రశ్నల వర్షం కురిపిస్తే తట్టుకోలేను ముందు కాసిని మంచినీళ్ళు ఇప్పించు అన్నాడు బాలాజీ

అలాగే " అంటూ స్వయంగా లేచి వెళ్ళి, గ్లాసుతో నీళ్ళు తెచ్చి ఇచ్చాడు రెండో చేత్తో మరొక కుర్చీ తెచ్చాడు

"అదేమిటి? ఇంట్లో ఎవ్వరూ లేరా? అడిగేడు బాలాజీ

"ఈ ఊళ్ళోనే ఉన్న తన అన్నగారి ఇంటికి వెళ్ళింది మా ఆవిడ మధ్యాహ్నం కాస్సేపట్లో వస్తుంది అన్నాడు పావనరావు

"అలాగా " అంటూ మంచినీళ్ళు తాగేడు బాలాజీ

వాళ్ళిద్దరూ హైస్కూల్లో మంచి స్నేహితులు తర్వాత వేరే వేరే ఊళ్ళలో కాలేజీలో చేరారు కొన్ని రోజులు ఉత్తరాలు రాసుకున్నారు తర్వాత అవీ ఆగిపోయాయి మళ్ళీ ఇన్ని రోజులకు కలిశారు

"నేను రాజమండ్రిలో వుంటున్నాను అక్కడే ఉద్యోగం చేస్తున్నాను. నువ్వు ఇక్కడ ఈ కాకినాడలో వుంటున్న విషయం నిన్ననే తెలిసింది లేకపోతే ఇంత ఆలస్యం చేస్తానా నిన్ను కలుసుకుందుకు మన మిత్రుడు నిన్న నేను ఇక్కడకు వస్తున్నప్పుడు రైల్లో కలిసి ఇక్కడే ఎక్కడో వుంటున్నావని చెప్పాడు దాంతో నిన్ను కలుసుకోవాలని ఈ కాలనీకి వచ్చాను. నేమ్ బోర్డు చూశాను నువ్వే ఎందుకు కాకూడదని తోచింది పిలవబోయేంతలో గార్డెన్లో కూర్చున్న నువ్వు కనిపించావు నీ కుడి కంటి పైన వున్న పెద్ద పుట్టుమచ్చ నువ్వే మా పావనరావు అని చెప్పింది అంతే " అన్నాడు బాలాజీ

"నీకు రైల్లో కలిసింది ఎవరు?

"ఆదేరా జగన్నాధం అని సన్నగా, పీలగా వుండేవాడు వాడిని మనం జగ్గు, మగ్గు అని ఏడిపించేవాళ్ళం "

పావనరావు ఆలోచించేడు కానీ గుర్తు రాలేదు ఆ(! ఎవడో వుండే వుంటారు లేకపోతే బాలాజీ ఎందుకలా చెప్తాడు?

'నాకు చాలా సంతోషంగా వుంది చాలా రోజులకు కలుసుకున్నాం ' హాయిగా నవ్వేడు పావనరావు

బాలాజీ కూడా చిరునవ్వు నవ్వేడు

"లైఫ్‌లో సెటిల్ అయ్యావా? ఎందరు పిల్లలు? ఇల్లు సొంతమేనా? అడిగేడు బాలాజీ

"ఆ (' లోను తీసుకుని ఇల్లు కట్టేను కొద్దికొద్దిగా తీర్చుస్తున్నాను ఒక్కతే కూతురు పెళ్ళి చేసుకుంటావు బాలాజీ అన్నాడు ఆ అని ఊరుకున్నాడు పావనరావు ఆ తర్వాత కూతురి గురించి వివరాలు చెప్పడం ఇష్టంలేకపోయింది అతనికి భార్యతో పాటు కూతురు కూడా బయటకు వెళ్ళడం మంచిదే అయ్యింది " అనుకున్నాడు లేకపోతే ఆమెను పరిచయం చెయ్యవలసి వచ్చేది ఆమె విధవ అన్న విషయం వీడికి తెలిసిపోయి వుండేది

నీ గురించి చెప్పు!' అన్నాడు పావనరావు

చిన్నగా నిట్టూర్చేడు బాలాజీ

"ఒక కొడుకు ఒక కూతురు చేతికి అందివచ్చిన కొడుకు ఏక్సిడెంటులో చచ్చిపోయేడు వాడికి పెళ్ళి చేసిన ఏడాదికి ఈ ఘోరం జరిగింది కోడల్ని నా ఇంట్లోనే పెట్టుకున్నాను కూతురుకి పెళ్ళి చేసి పంపాను ఆమె సఖంగానే వుంది సమస్య కోడలితోనే "

అరెరె ఎంత కష్టం వచ్చింది! చేతికి అందివచ్చిన కొడుకు పోవడం చాలా బాధాకరమే ' అన్నాడు పావనరావు

నా బాధ సరే ఇంట్లో కోడలు పిల్ల ముఖం చూస్తే నాకు మరింత బాధ కలుగుతుంది. పట్టుమని పాతికేళ్ళు లేవు వైధవ్యం ముంచుకొచ్చింది ఆమెకు మళ్ళీ వివాహం చెయ్యాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నాను కానీ అబ్బాయి దొరకద్దూ?" నిరాశగా అన్నాడు బాలాజీ

నిజమే ఈ రోజుల్లో అంత మంచి మనసుగల యువకులు ఎక్కడ దొరుకుతారు? మామూలుగా ఆడపిల్ల పెళ్ళి చెయ్యడానికే వేలకొద్దీ కట్నాలు

పొయ్యాలి లాంఛనాలు జరపాలి అయినా ఏవో గొంతెమ్మ కోరికలు వుండిపోతాయి అలాంటిది భర్త చనిపోయిన అమ్మాయికి పెళ్ళి జరగడం చాలా కష్టమే అన్నాడు పావనరావు

'పరవా లేదు దేశం అంతా వెతికి అయినా, ఎంత కష్టపడ్డా ఎవర్నో ఒకర్ని పట్టుకుంటాను మళ్ళీ నా కోడలు జీవితంలో నవ్వులు పండేదాకా శాంతి లేదు నాకు నా బాధ మరొకదానికి అన్నాడు బాలాజీ

'ఏమిటి?

ఆ కోడలు పిల్ల తల్లిదండ్రుల దోరణికి నాకు ఒళ్ళు మండుతుంది ఆ అమ్మాయికి మళ్ళీ పెళ్ళి చెయ్యవద్దంటారు సాంప్రదాయం, చట్టుబండలు అంటున్నారు కోడలు గురించి నేను పడుతున్న బాధలో సగం కూడా వాళ్ళు కూతురు గురించి పడటం లేదు వాళ్ళతో బాగా కొట్లాడాను వాళ్ళ పద్ధతి తప్పు అని నచ్చ చెప్పాను కానీ వినటం లేదు మూర్ఖులు అన్నాడు కొంచెం కోపంగా బాలాజీ

పావనరావు కొంచెం ఉలిక్కిపడ్డాడు

'కొంత మంది కొన్ని ఆచార వ్యవహారాల కోసం ప్రాకులాడతారు అన్నాడు పావనరావు

'అదే తప్పు మారుతున్న కాలంతో మనమూ మారాలి పూర్వకాలం ఆడదానికి చదువు ఎందుకన్నారు ఇప్పుడు చదువుకోవడమే కాదు ఉద్యోగాలు కూడా చేస్తున్నారు నువ్వు మీ అమ్మాయికి చదువు చెప్పించావా లేదా?'

చెప్పించాను

'కరక్టు మన బామ్మలు, అమ్మమ్మలు చదువుకోలేదని మన అమ్మాయిలకు చదువు చెప్పించడం మానలేదు కదా! సతీ సహగమనం అన్న ఆచారం గతంలో వుంది ఇప్పుడు దానికి స్వస్తి చెప్పామా లేదా? అలాగే గతంలో విధవా వివాహాలు లేవుకదా అని ఇప్పుడు కూడా వుండకూడదంటే ఎలాగ? నా కోడలు కోసం నేను చింతించని క్షణం లేదు

'సాంప్రదాయాలు ఇంకా ఏదో అనబోతున్న పావనరావుతో

రబ్బిష్ నువ్వు కూడా మా వియ్యంకుడిలాగే మాట్లాడకు ఈ సాంప్రదాయాలు అన్నవి "ముసుగు లాంటివి ఆ ముసుగులో కూర్చుంటే చుట్టూ చీకటి తప్ప మరేమీ కనిపించదు చీకటి అంటే నిరాశ, తిరోగమనం ఒక్కసారి ఆ ముసుగులోంచి బయటపడి చూస్తే కనిపించేది వెలుగు వెలుగు అంటే ఆశ, అభివృద్ధి, జ్ఞానం ఆ ముసుగులోంచి బయటపడనంత కాలం మనుషుల్ని భగవంతుడు కూడా -రక్షించలేడు అన్నాడు బాలాజీ ఆవేశంగా

పావనరావుకి ఎవరో చెంపమీద కొట్టినట్లు అనిపించింది

బాలాజీ మాటలు పదే పదే అతని మనసులో కదిలాయి

కాఫీ తీసుకొస్తాను" అంటూ లేచి లోపలకు వెళ్ళాడు పావనరావు బాలాజీ అభ్యంతరం పెడుతున్నా వినకుండా

బ్రూ కాఫీ కలుపుతున్నా అతనికి బాలాజీ మాటలు చెవిలో ధ్వనించాయి

కాఫీ అందించేడు పావనరావు

ఇంతకీ ఏ పనిమీద వచ్చావు? అడిగేడు బాలాజీని

'చెప్పాను కదా నాకు ఉన్న సమస్య ఒక్కటే అని అదే కోడలుకి సంబంధం వెతకడం ఈ ఊళ్ళో ఒక కుర్రవాడు వున్నాడట అతని ఆదర్శం ఒక విధవను పెళ్ళి చేసుకోవడం అట అదృష్టవశాత్తూ ఒక మధ్యవర్తి ద్వారా తెలిసింది ప్రయత్నించాలని వచ్చాను '

పావనరావుకి సందేహం కలిగింది

ఎవరబ్బాయి? అడిగేడు

ఏమో! ఈ ఊళ్ళోనే ఒక భర్తపోయిన అమ్మాయిని చేసుకోవాలను కున్నాడట అందుకు కారణం ఆమెను గతంలో అతను ప్రేమించడమే ఇందాకా నేను చెప్పిన ముసుగు లో వున్న ఆ అమ్మాయి తండ్రి అందుకు అభ్యంతరం చెప్పాడట దాంతో నిరాశ చెందిన ఆ అబ్బాయి ఈ ఆదర్శం పెట్టుకున్నాడట మా కోడలు పిల్ల అదృష్టవంతురాలైతే ఈ సంబంధం కుదిరి పోతుంది అన్నాడు బాలాజీ

అబ్బాయి పేరు ఏమిటి?"

ఏదో వుంది మధ్యవర్తి మాత్రం చంద్రం' అని చెప్పాడు పూర్తి పేరు ఇంకేదో వుండొచ్చు సరే నేను వెళ్తాను అంటూ లేచాడు బాలాజీ

ఆగు ఏం తొందర? అన్నాడు పావనరావు

అబ్బే ఆ మధ్యవర్తి అలా ఎక్కడికో వెళ్ళాడని చెప్పారు ఆయన ఇంటికి వెళ్తే నేను వచ్చి ఒక గంట కాలేదూ? ఈ పాటికి వచ్చి వుండొచ్చు ఆయన వెళ్తాను రాజమండ్రి వెళ్ళాక ఉత్తరం రాస్తాను అన్నాడు బాలాజీ

ఒక కాగితం మీద తన చిరునామా ఇచ్చేడు పావనరావు బాలాజీ చిరునామా తీసుకున్నాడు

బాలాజీ వెళ్ళిపోయేడు

ఆలోచిస్తూ కూర్చున్నాడు పావనరావు

బాలాజీ ఎంత గొప్పవాడు! కోడలుకి మళ్ళీ పెళ్ళి చెయ్యడానికి ప్రయత్నిస్తున్నాడు తన కడుపున పుట్టిన కూతురికి మళ్ళీ పెళ్ళి చేయడానికి తను సందేహపడుతున్నాడు నిజంగా వాడు చెప్పిన 'ముసుగు'లో వున్నాడు సంఘానికి తను ఎందుకు భయపడాలి? వాళ్ళు తన బాగోగులు చూస్తారా? తనకు ఎందుకంత పిరికితనం? తన కూతురు బ్రతుకు తను కాకపోతే ఇంకెవరు బాగు చేస్తారు? బాలాజీకి కుర్రాడిని వెతికే సమస్య తనకు ఆ సమస్యే లేదు ఒక రకంగా తను అదృష్టవంతుడు ఆ అదృష్టాన్ని ఆహ్వానించాలి తప్ప కాదనకూడదు అది మూర్ఖత్వమే తన కూతురు పసుపు కుంకుమలతో తిరగాలని తనకు ఉన్నా, ఏదో అర్థంలేని పిరికితనం తనని కట్టి పడేసింది ఆ బంధాల్ని తెంచుకునే బలం బాలాజీ మాటలు ఇచ్చాయి తను ఆలస్యం చెయ్యకుండా, చంద్రమౌళికి క్షమార్పణలు చెప్పుకుని తన కూతుర్ని కట్టబెట్టాలి

బాలాజీ ప్రయత్నిస్తున్నది కూడా ఈ చంద్రమౌళి కోసమేనా?

ఆ ఆలోచనలకే అతని గుండె వేగంగా కొట్టుకుంది

అదే నిజమైతే అతను తన చెయ్యి జారిపోయినట్లేనా? అలాగ జరిగితే మళ్ళీ మరొక వ్యక్తిని వెతకడం తనకు సాధ్యమా?

మనిషికి స్వార్థ చింతన సహజం కనుక బాలాజీ





ఇటీవల మదరాసులో ప్రదర్శింపబడిన "హరిజనాగ్రహారం" నాటకంలో ఉత్తమ నటిగా ఎన్నికై కళాసాగర్ స్పెషల్ అవార్డును ఆంధ్రప్రదేశ్ గవర్నర్ డా.శంకర్‌దయాళ్‌శర్మ నుండి అందుకుంటున్న శ్రీమతి కె.ఇందిరాదేవి.

కంటే ముందు తనే ఈ అవకాశం వాడుకోవాలి.

వెంటనే లేచి బట్టలు మార్చుకుని ఇల్లు తాళం పెట్టి చంద్రమౌళి ఇంటికి పరుగులాంటి నడకతో వెళ్ళాడు పావనరావు.

అదృష్టవశాతూ ... చంద్రమౌళి ఇంట్లోనే వున్నాడు.

"మీరా! ... రండి ..." అన్నాడు చంద్రమౌళి.

ఒక గంట తర్వాత ఇల్లు చేరాడు పావనరావు.

భార్య, కూతురు ఇంటి తలుపు దగ్గర కూర్చుని వున్నారు.

"ఎక్కడికీ వెళ్ళనని చెప్పి ... ఎక్కడకు వెళ్ళారండీ? ... పావు గంట నుంచి మీ కోసం చూస్తున్నాం ..." అంది సీత.

"చంద్రమౌళి దగ్గరకు వెళ్ళాను ... సుహాసిని పెళ్ళి గురించి మాట్లాడటానికి. అతను సంతోషపడి అంగీకరించాడు. త్వరలోనే వాళ్ళ పెళ్ళి చేస్తాను ..." అన్నాడు పావనరావు.

తల్లీ కూతుళ్ళు ఆశ్చర్యపోయి తర్వాత ఆనందించారు.

ఆ ఇంట్లో నవ్వులు పండాయి.

* * * * *

ఒక నెల రోజులు గడవక ముందే రిజిస్ట్రార్ ఆఫీసులో సుహాసిని, చంద్రమౌళిల వివాహం జరిగిపోయింది. పావనరావు అంగీకారం దొరకగానే

ముసుగు

ఇక ఆలస్యం చెయ్యకుండా చంద్రమౌళి తన ఇంట్లోనే తన వివాహ ప్రసక్తి తెచ్చి సుహాసిని గురించి చెప్పాడు. ఒక విధవను కోడలుగా తెచ్చుకుందుకు చంద్రమౌళి తల్లిదండ్రులు ముందు అంగీకరించలేదు. కానీ చంద్రమౌళి కార్యసాధకుడు. బెదిరించి ఒప్పించాడు మొత్తానికి.

సుహాసినిని తనదాన్ని చేసుకోగలిగినందుకు చంద్రమౌళి ఆనందానికి అంతులేదు. సుహాసిని పరిస్థితి కూడా అందుకు భిన్నంగా లేదు. పెళ్ళి జరిగిందన్న మాటే గానీ భర్తతో గడిపిన రోజులు మూడే. అందుకే అతడిని తెలిగ్గానే మరిచిపోగలిగింది. తనంటే ఇష్టపడే చంద్రమౌళికి తననే అంకితం చేసుకుంది.

పావనరావుకి రెండు మూడు సార్లు బాలాజీ గుర్తు వచ్చాడు. తనలో మార్పు తేగల్గిన వ్యక్తి అతనొక్కడే. మామూలు క్షేమ సమాచారాలు తెలుపుతూ రెండు ఉత్తరాలు రాశాడు. బాలాజీ జవాబు రాయలేదు.

* * * * *

ఆఫీసు పని మీద గుంటూరు వెళ్ళవలసి వచ్చింది పావనరావుకి. రైల్లో వెళ్తుండగా రైలు రాజమండ్రి స్టేషన్లో ఆగింది. ఆ స్టేషన్ చూడగానే బాలాజీ గుర్తు వచ్చాడు అతనికి.

ఒక అమ్మాయి రైలు ఎక్కి పావనరావు ముందు కూర్చుంది.

"జాగ్రత్తగా వెళ్ళు తల్లీ .. విజయవాడలో మీ ఆయన వచ్చి దింపుకుంటాడులే ... పగటి ప్రయాణమే కదా అని నేను రావటంలేదు..." అంటూ ఆ అమ్మాయితో చెప్తున్నాడు ప్లాట్‌ఫారం మీద నిలబడ్డ వ్యక్తి. అతని వైపు చూశాడు పావనరావు.

ఆశ్చర్యం ... అతను బాలాజీ ...

"బాలాజీ ..." అన్నాడు అభిమానంతో పావనరావు.

"అరె నువ్వా!" అంటూ ప్రేమగా చేతులు కలిపాడు బాలాజీ.

"అమ్మాయ్! ... ఇతను నా స్నేహితుడు ... నీకు తోడుగా వుంటాడు ... అన్నాడు కూతురితో బాలాజీ.

ఆమె పావనరావుకి నమస్కరించింది.

"మా అమ్మాయి విజయవాడ వెళ్తోంది... దారిలో ఏదైనా అవసరం పడితే ... అన్నాడు బాలాజీ.

"అలాగే నువ్వేం బెంగపడకు ... అన్నాడు పావనరావు.

ఇంతలో రైలు కదిలింది. ప్లాట్‌ఫారం మీంచి చెయ్యి ఊపాడు బాలాజీ.

రైలు వేగం పుంజుకుని గోదావరినది దాటింది.

బాలాజీతో సరిగ్గామాట్లాడలేక పోయాడు... టైము లేకపోయింది... ఇంతకీ వాడు కోడలుకి పెళ్ళి చెయ్యగలిగాడో లేదో ఇంతవరకు!

ఈ అమ్మాయిని అడగవచ్చు గదా!

ఆమెతో పిచ్చాపాటీ మాట్లాడసాగాడు పావనరావు.

"ఏమ్మా మీ వదినెకు పెళ్ళి అయిందా?" అడిగేడు పావనరావు.

ఆమె ఆశ్చర్యపోయింది.

"వదినా?" అంది.

"మీ అన్నయ్య పోయాకా ఆమెను వివాహం చెయ్యాలని బాగా ప్రయత్నిస్తున్నాడు కదా మీ నాన్న ..."

"మీరు ఏమంటున్నారో ఏమీ అర్థం కావటంలేదు ... నాకు. నాకు అన్నయ్య ఏమిటి? మా నాన్నగారికి నేను ఒక్కర్తినే బిడ్డను ..." అంది ఆమె.

పావనరావు తల తిరిగింది.

"నువ్వు బాలాజీ సొంత కూతురివేనా?

"అవునండీ ... ఇప్పుడు రైలు ఎక్కించడానికి వచ్చిన మీ స్నేహితుడు బాలాజీ గారి సొంత కూతుర్ని. నాకు అన్నకానీ తమ్ముడు కానీ లేరు. అక్కగానీ చెల్లెలు గానీ లేదు. నేను ఒకే ఒక కూతుర్ని ఆయనకు...." అంది ఆమె ఆ మాటల్ని నొక్కి పలుకుతూ.

పావనరావు అంతా అయోమయంగా వుంది... అంటే ఆ రోజు బాలాజీ తనకు అన్నీ అబద్ధాలు చెప్పాడా? ఎందుకని?

ఆ తర్వాత అతను ఎక్కువ మాట్లాడలేదు ఆమెతో. విజయవాడలో ఆమెని క్షేమంగా ఆమె

భర్త కు అప్పచెప్పాడు

* * *

కాకినాడ తిరిగి వచ్చాడన్న మాటే గానీ పావనరావు ఆలోచన నిండా బాలాజీయే నిండిపోయాడు వాడు అంత ఘోరమైన అబద్ధాలు పనికట్టుకుని తన ఇంటికి వచ్చి ఎందుకు చెప్పవలసి వచ్చిందో ఎంత ఆలోచించినా అర్ధంకాలేదు మనసులో రొద ప్రారంభం అయ్యింది దాన్ని భరించలేక తిన్నగా బాలాజీకే ఒక ఉత్తరం రాశాడు ఒక వారం తర్వాత బాలాజీ నుంచి జవాబు వచ్చింది చదివేడు ఆత్రంగా

"డియర్ పావనరావ్!

'మా అమ్మాయి నీకు చెప్పినదంతా పచ్చి నిజం నేను నీతో అన్నీ అబద్ధాలు చెప్పాను ఒకరి కోసం ఒకరు అన్నట్టు ఆరాటపడుతున్న ఇద్దరు వ్యక్తుల్ని కలపడం కోసం ఈ అబద్ధాలు ఆడాను అందుకే నేను ఈ అసత్యాలకు చింతించటంలేదు ఇంకా వివరంగా రాస్తాను

చంద్రమౌళి హైస్కూలు చదువు ఇక్కడే చదివాడు మా ఇంటి పక్కనే వుండేవాడు చాలా మంచివాడు కావడంతో నన్ను ఆకర్షించేడు అతనికి ఏ సమస్య వచ్చినా నేను తీర్చేవాడిని అందుకే నన్ను 'గురువుగారూ' అంటాడు ఆ మధ్య అతను మీ అమ్మాయిని చేసుకునే ప్రయత్నంలో నీ నుంచి వ్యతిరేకంగా విని నాకు ఉత్తరం రాశాడు ఆదుకుని ఆ అమ్మాయిని వివాహం చేసుకోవడంలో సహాయపడమని ప్రాధేయపడ్డాడు ఈ రకంగా ప్రవర్తించే కుర్రాళ్ళు ఈ లోకంలో అరుదు పెళ్ళి చేసుకుందుకు ఇతను సిద్ధపడ్డా, భర్త పోయిన కూతురికి పెళ్ళి చెయ్యడానికి సిద్ధపడని ఆ తండ్రి మీద నాకు బాగా కోపం వచ్చింది ఆ తండ్రి అజ్ఞానానికి జాలి వేసింది అప్పట్లో ఆ తండ్రివి నువ్వే అన్న విషయం నాకు తెలియదు ఆ తండ్రికి నేను నచ్చ చెప్పాలి అనుకుని కాకినాడ వచ్చాను చంద్రమౌళితో కలిసి మీ ఇంటికి బయలుదేరాను దారిలో నువ్వు నాకు కనిపించావు నా మిత్రుడిగా నిన్ను గుర్తుపట్టి పలకరించబోయేంతలో నువ్వే ఆ అమ్మాయి తండ్రివని చంద్రమౌళి చెప్పాడు ఆ సమయంలో నువ్వు నన్ను చూడలేదు

ఆ పిల్ల తండ్రివి నువ్వే అని తెలిశాకా ఒక పథకం వేశాను నిన్ను ఇంటి దగ్గర కలిశాను కట్టు కథ కల్పించి పరోక్షంగా నీ మీద ప్రభావం చూపేను నువ్వు తప్పకుండా మారతావని నాకు నమ్మకం కలిగింది ఆ తర్వాత లేచి వచ్చేశాను నువ్వు నాకు తెలిసిన వాడవు కనుక వెతుక్కుంటూ వచ్చి సలహా ఇవ్వడానికి నా మనస్సు అంగీకరించక పోవడం వల్ల ఈ అంతర్నాటకం ఆడేను అది ఫలించిందని చంద్రమౌళి ఉత్తరం ద్వారా తెలుసుకుని ఆనందించాను తన పెళ్ళికి నన్ను రమ్మని అతడు కోరేడు కానీ ఈ నాటకం అప్పుడే బయటపడటం



నాకు ఇష్టంలేక రాలేదు

ఈ ఉత్తరం చదివేక నా మీద అభిమానం పెంచుకుంటావో లేక కోపంతో అసహ్యించుకొంటావో నాకు తెలియదు మొదటిది జరిగితే సంతోషిస్తాను రెండోది జరిగితే బాధపడను

ఒక విషయం గుండెల మీద చెయ్యి వేసుకుని ఆలోచించు జరిగిపోయిన విషాదం అనుక్షణం గుర్తు చేస్తూ, పసుపుకుంకుమలకు దూరమై, నీ కళ్ళ ముందు నీ కూతురు తిరుగుతూ నీ గుండెల్లో బాధాగ్ని రగుల్చుతుంటే బాగుంటుందా లేక దూరమైన పసుపుకుంకుమలు తిరిగి సంపాదించుకుని, అల్లుడితో హాయిగా, మాయని చిరునవ్వుతో కాపురం చేసుకుంటుంటే బాగుందా?

జవాబు రాయి

నీ మిత్రుడు,

బాలాజీ."

ఉత్తరం చదివిన పావనరావు కొంచెంసేపు ఆలోచించాడు

అతని పెదవులపై చిరు దరహాసం ప్రత్యక్షమైంది.

థాంక్స్ బాలాజీ! నా కళ్ళు తెరిపించి నా కూతురు జీవితం బాగుపడడానికి కారణం అయ్యావు నీ మేలు మరిచిపోలేను " అనుకున్నాడు

బాలాజీకి ధన్యవాదాలు తెలుపుతూ ఉత్తరం రాయడానికి కూర్చున్నాడు పావనరావు □